# ఇక ఇది ఇంతే..!

ఫస్ట్ తారీఖు సాయంత్రం. అదొక మధ్యతరగతి కుటుంబం. ప్రతిసారీ జరుగుతున్నట్లే ఈసారీ జరిగిన సంఘటన.

"ఊఁ చెప్పు." కాగితం, కలం చేతిలోకి తీసుకుంటూ భార్యముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు సూర్యప్రకాశ్. అతని కెదురుగావున్న కుర్చీని, ఇంకొంచెం ముందుకి లాక్కొని కూర్చుంటూ అసహనంగా చూసింది అరుణ భర్తకేసి.

"చెప్పేందుకేముంది. ఎప్పుడూ వున్నదేగా.... మామూలు భాగోతం. నాచేత పిచ్చిదానిలా వాగించడమూ, మీ ఇష్టానుసారం వ్రాసుకుంటూ పోవడమూను. ఇంతోటి మహాభాగ్యానికి నన్నెందుకూ అడిగించుకోవడం మహా గొప్పగా."


"అబ్బ....చెబుదూ! విసిగించక" అంతలోనే ప్రకాశ్ కనుబొమలు చిట్లించుకున్నాయి, పెదవులు విచ్చుకున్నాయి, చిరాకుని సూచించే ధోరణిని స్పష్టపరుస్తూ. ఇక తప్పదని తెల్సుకున్న అరుణ ఇంటికి కావలసిన నెలసరి వెచ్చాలు చెప్పుకుపోసాగింది. దాన్ని తగ్గించుకుంటూ తన మామూలు ప్రకారం రాసుకుంటూ పోయాడు ప్రకాశ్. పూర్తి అయిన కాగితాన్ని జేబులో కుక్కుకోబోతూండగా భార్యామణి అడగనే అడిగింది "ఏదీ చూడనీయండి" అంటూ. చూసిన మరుక్షణం ఇంతెత్తున ఎగిరిపడింది.

"నేను ముందే చెప్పేను, నన్నేం అడగొద్దని. నేను చెప్పినట్లు ఏం వ్రాశారనీ....? బియ్యం ఇరవై కిలోలు రాశారు. ఏం? ఒంటిపూట భోజనం చేస్తారా? లేక అఖరివారం నిరాహారదీక్ష పూనతారా??"

మధ్యలోనే అడ్డు తగులుకున్నాడు ప్రకాశ్.

"అరుణా! పరిస్థితులు అర్థంచేసికొని మరీ మాట్లాడు. నిన్నేం ఉపవాసాలుండమనటంలేదు. అర్ధాకలితో లేచిపొమ్మనడంలేదు. బియ్యం ధరెంతో తెలుసా? నాల్గు రూపాయలు. క్వాలిటీదయితేగానీ ముద్ద మింగుడుపడదు. సర్దుకుపోయే మనస్తత్వం కాదు మనది. నిన్నొక్కదాన్ని అనడంలేదు. 'మన' చేర్చేనుగా! గుడ్లురిమి చూస్తావేం? పోతే మిగిలిన పదికిలోలూ గోధుమలు వాడితే నష్టమేముంది చెప్పు? డబ్బుకి డబ్బు తగ్గుతుంది.

శ్రీమతి అయ్యగారి వెంకట సత్యవతి



వంటికి మంచిదికూడ. అసలు నన్నడిగితే వాతావరణందృష్ట్యా తిండిలోనూ మార్పు అలవర్చుకోవడం సహజం. వెధవ రొట్టెలు నాకిష్టంలేదంటే కుదరదు. అన్నీ అలవాటు చేసుకోవాలి మరి." సాధ్యమయినంత నచ్చచెప్పే ధోరణిలో వున్నా ఒకింత అధికారత్వం కూడ తొంగి చూసింది ప్రకాశ్ స్వరంలో. అరుణ ముఖం ఎర్రబడింది.

"మంచిది. ఇన్నాళ్ళకి తమర్ని కట్టుకున్న నేరానికిగాను తమ మాట శిరసావహిస్తూ అలవాటులేని రొట్టెలని మింగుతాలెండి. మరి సబ్బులసంగతేమిటి? నేను నాలుగు చెబితే ఒక్కటే రాశారు. బట్టల సబ్బా అంతే. అదీ ఒక్కటే రాశారు. సరే.... సర్ఫ్ అయితే కుదించి చిన్నసైజు చేసి పారేశారు. మళ్ళీ నాల్గు రోజులయ్యేసరికి మేటెడు బట్టలుతయారు తమవీ.... పిల్లలవీ. ఈ టెర్లిన్ ధర్మమా....ని చాకలి ముఖం ఎలాగూ చూడం. ఇవి కూడ తగ్గించేస్తే ఏంపెట్టి ఉతకాలిట?" గట్టిగా అరిచింది.

"అరుణా! మళ్ళీ మొదటికే వస్తున్నావు. మన ఇద్దరిలో సామరస్యం.... పరిస్థితుల కనుగుణంగా నడుచుకునే నేర్పు చాల అవసరం. ఇలా దెబ్బలాడుకుంటూ కూర్చుంటే ఎప్పటికి తెగేను సమస్య! చదువుకున్నదానివి. కాస్త నిదానించి ఆలోచించు. ప్లీజ్ గట్టిగా అరవకు. చూడు, సబ్బుల ధర ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో అది కాస్త తగ్గిస్తే చచ్చిపోతామా.... చెప్పు. శీతాకాలం కూడ. అవంత లేకున్నా ఫర్వాలేదు. అసలు నన్నడిగితే...."

మధ్యలోనే అందుకుంది అరుణ. "ఊం(.... తమరెన్నెవరూ అడగబోవడం లేదిక్కడ. తెలుస్తూనే వుంది మీరు చెప్పబోయేదేమిటో....' చక్కగా సున్నిపిండి రుద్దుకుంటే ఒళ్ళు నునుపు దేలుతుంది. ఆరోగ్య దృష్ట్యా శుభకరం. పైగా బోలెడంత పొదుపు' అనే కదూ! నా సంగతలా వుంచండి. ముందు మీ పుత్రరత్నాలు సున్నిపిండి మర్దిస్తారేమొ, కనుక్కోండి." హేళనగా నవ్వింది అరుణ.

ఉస్సురన్నాడు ప్రకాశ్. రాసిన 'లిస్ట్' విసురుగా ప్రక్కన పడేశాడు. ఇంక ఈ జన్మకింతే. తనని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించదేం అరుణ. తనమీద కక్షసాధిస్తున్నట్లుగా, కసిగా, అనవసర ఖర్చులు తప్పనిసరంటూ వాదిస్తుంది. కాదంటే ఎడమొహం... పెడ మొహం.... పిల్లల్ని చీవాట్లు, చెప్పు దెబ్బలు, సక్రమమైన టైముకి తిండి అమర్చకపోవడం.... ఇవన్నీ తనమీద నేరుగా తీర్చుకునే ధైర్యంలేక ప్రక్క తోవలు పట్టించి తన మనస్సు కకావికలమయిపోయేందుకు దోహదమిచ్చే సాధనాలు. బొద్దూడని వెధవాయి దగ్గర్నుంచీ విప్లవ ధోరణి. ఆ మధ్య "వజ్రదంత్" పండ్లపొడి తెస్తే ఇంట్లో చిన్న గాలిదుమారం చెలరేగింది. పళ్ళ పొడి మాకక్కర్లేదంటే....మాకక్కర్లేదని ఒకటే గోల. "కావాలంటే మీరు తోముకోండి నాన్నగారూ! మాకు బినాకా గ్రీన్....అంటే నాకు బినాకా రోజ్" అని అమీన్ సహాని పోజు దంచేశారు బడుద్దాయిలు. ఇదంతా చోద్యం చూస్తూ పమిటకొంగు అడ్డుపెట్టుకుని నవ్వుతున్న అరుణ తన కోపాగ్నికాజ్యం పోసినట్లయింది. ఏమీ తెలియని వయసులో ఏదో వాగుతున్న పసివెధవల్ని మందలించి సర్ది చెప్పేందుకు ప్రయత్నించకపోవడమటుంచి, వాళ్ళకి సపోర్టునిస్తూ తనకేమీ పట్టనట్లుంటుందా....! పైగా నవ్వు కూడాను. ఒళ్ళు మండింది తనకి. తల్లిగా ఆమె తన బాధ్యత విస్మరిస్తే తను తండ్రిగా పిల్లల్ని సమాధానపరచడం తన కనీస కర్తవ్యంగా భావించి పిల్లలకేసి బుజ్జగిస్తూ అన్నాడు. "చూడు సతీష్! ఐదు నిమిషాల్లో పళ్ళు శుభ్రపరుచునేందుకు ఏదయితేనేం? దాని ఫలితం కావాలిగానీ. మనవాళ్ళు అంటే మా నాన్న.... మా తాతగారు అన్న మాట. కచిక, పందుం పుల్లలతో తోముకుని పొదుపును పాటించడమేగాక వారి పండ్లు....దంతాలు వజ్రాలలా మెరుస్తూ దృఢత్వంగా వుండేవి తెలుసా! ఇప్పటివారిలా పళ్ళ సలుపులనీ.... దంతాలు పుచ్చిపోయేయనీ అని ఎరుగుదురా....? నడ్డి వంగిపోయేదేగానీ ఒక్క పన్ను వూడిపోయింది కాదు. 'చక్కిలాలు' లాంటి గట్టి పదార్థాలు కూడ అవలీలగా తినేసేవారు. మరి....

ఇప్పుడు మీరో? అమ్మ చెరుకుగడ చీరి ముక్కలుగా కోసి ప్లేట్లో అందిస్తేగాని తినలేరు. ఒకవేళ తిన్నా పళ్ళలోంచి రక్తం వస్తోందే....అంటూ పరుగులు పెడతారు. ఇదంతా ఎందుకో తెలుసా? మనం పేస్టలు వాడి వాడి పేస్టలా తయారవుతున్నాం. అందుకనీ పొద్దుపుకి పొద్దుపుగానూ...."

ఇంకా ఏదో చెప్పబోతున్న తనని మధ్యలోనే నిలిపేస్తూ దిగ్గునలేచి నిలబడింది అరుణ.

"ఛి....ఛి.... లేచింది మొదలు సవాలక్ష వంకలు పెడుతూ మొదలెడతారు వెధవ పొద్దుపు ఉద్యమం గురించి. అన్నీ బాగా నేవున్నాయి శ్రీరంగనీతులు. చెప్పేటంత సులభం చెయ్యడంలో లేదని వూరికే అన్నారా....? ఇన్ని కబుర్లు చెబుతున్న మీరెందుకు మరి ఆ సిగరెట్ల జోలికి పోకుండావుండరు? పాపం....అది తక్కువ ఖర్చా? పైగా 'ఆరోగ్యదృష్ట్యా,' అన్న పదం ఇక్కడ వర్తించదు. ఆ పొగతోబాటే ఇదీ 'వుఫ్' మని ఎగిరి పోతుంది కామోలు. ఆ వెధవ ఖర్చు తగలేయడం మానేస్తే ఆ ఖర్చుతో మహారాజులా బట్టలూ....ఒళ్ళు....పళ్ళూ అన్నీ శుభ్రపడతాయి" అంటూ రుసరుస లాడుతూ లోపలికెళ్ళిపోయింది. ఆ పూటకి టిఫెన్ సున్న. పోనీ "టీ" నీళ్ళయినా పోస్తుందేమోనని ఆశగా వంటింటికేసే చూడసాగేడు.

ఆఫీసు టైం అయిపోతూండటం గమనించి మరి వుండబట్టనేరక తెచ్చి పెట్టుకున్న చిరాకుతో "కాస్త టీ నీళ్ళ మయినా ఇచ్చేది వుందా.... అదీ లేదా?" అన్నాడు. బాణంలా దూసుకువచ్చింది జవాబు.

"నాకు ఓపికలేదు. తాగాలనుకుంటే పెట్టుకు తాగండి. లేదూ.... పదిగంటల కెలాగూ వుందిగా కాంటీన్ ఖాతా.... కల్సొస్తుంది దయచేయండి."

ఉస్సురంటూ సైకిల్ తీసుకుని వెళ్ళి పోయాడు. అతను వెళ్ళినట్లు గ్రహించిన అరుణ ఛంగున మంచందిగి "రండర్రా పిచ్చిమొఖాల్లారా!మీకు తొందరగా ఉప్మా చేసి పంపిస్తాను. ఆ దొరగారికేం?ఇక్కడ గాకపోతే కాంటీన్ మహాతల్లి వుందిగా! సుష్టుగా మెక్కుతారు." అంటూ గబగబా ఉప్మా కలియబెట్టి వాళ్ళకింత పెట్టి, తను కాస్త తిని, అంతా సర్ది వాళ్ళనటు స్కూళ్ళకి పంపి.... ఏదో వంట అయిందనిపించి మళ్ళీ మంచం ఎక్కే సింది. అక్కడ ప్రకాశ్ మామూలుగా పదిగంటలకి కాంటీన్‌కి వెళ్ళి వుత్త టీ తీసుకుందామనుకున్నవాడల్లా అరుణ తనకివాళ టిఫిన్‌లాంటిదేమీ పెట్టలేదని గుర్తుకొచ్చి చాల కోపం.... ఆపై మరింత ఆకలి హెచ్చి అరుణ కిష్టమైన సమోసాలు తనవాటా ఆమెవాటా అని లెక్కిస్తూ కసిగా తినేసి తృప్తిపడ్డాడు.

జరిగిన సంఘటన గుర్తుకొచ్చిన

ప్రకాశ్ పెదవులు ముసిముసిగా నవ్వుకున్నాయి. అంతవరకూ కణతలు రుద్దుకుంటూ వెనక్కి జార్లపడి ఆలోచిస్తున్న అరుణకు అతను నవ్వుకోవడం చూచి చిర్రెత్తుకొచ్చింది.

"నా కవతల బోలెడు పని తగలడింది. నే పోతున్నా. తీరుబడిగా ఆలోచించుకుని మీకు తోచింది తీసుకొచ్చిపడేయండి. నాకు తోచింది నే వండి పారేస్తాను. అంటూ రివ్వున లోపలికి వెళ్ళిపోయింది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచిన ప్రకాశ్ కంటికి వెనుదిరిగి లోనికెడుతున్న భార్య అందంగా కనిపించింది. ఏమా తలకట్టు? కెరటాల్లా వంకీలు తిరిగిన బారెడు జడ అటు ఇటు విసురుగా వూగుతూంటే అతని మనస్సు రెపరెపలాడింది. ఆ జడని చూసే కదూ.... తను అరుణని ప్రేమించి పెళ్ళిచేసుకొంది? తను ఏరి కోరి చేసుకున్నాననేకదూ.... అరుణకి తనపై అంతటి నిర్లక్ష్యం, అహంకారం. ఆ మాట కొస్తే తను మాత్రం తక్కువ తిన్నాడా? ఆమె ఏమి చెప్పినా 'కాదు' అనే మన స్తత్వంబాగా అలవర్చుకున్నాడు. అదే ఇంకొక 'అదది' చెప్పిన విషయం ఆలోచింపజేసేదిగా తన భార్య చెప్పిన విషయం ఆలోచింపనీయడంలేదు. నిజానికి తనే అస్కారం ఇవ్వడంలేదు తనలోను పొరపాటు వుండే వుంటుంది. పాపం.... అరుణకి తనమీద కోపం కేవలం సిగరెట్లు త్రాగుతాననేకదూ! అంతకుమించి మరే విషయంలోనూ తర్కించదు. సిగరెట్లు మానాలని ఎప్పట్నుంచో నేనూ అనుకుంటున్నాను. కానీ ఏం లాభం? దానికి తగ్గ ప్రయత్నాలు అడపా, తడపా చేస్తూనేవున్నాను. బలహీనుణ్ణి. నిగ్రహించుకోనేరక 'వేళ'కి పెదాలు పీక్కుపోతూ తోటి జనాలు విలాసంగా పొగ వదులుతూ రెచగొడుతూంటే భరించలేక, తర్జన భర్జనలావలికి నెట్టి, తప్పుచేస్తున్న ఫీలింగ్ ఓ మూల నలిపేస్తున్నా పట్టించుకోలేని నిస్సహాయుడిగా బానిసనయిపోతున్నాను. అరుణ మాత్రం ఏం చేస్తుంది! ప్రేమించి పెళ్ళాడేదన్న మాటేగానీ మొదటిరాత్రే 'నాకు సిగరెట్ వాసన కిట్టదండీ' అంటూ ముద్దుగా చెప్పినా ఆ వ్యసనాన్ని త్యజించే పాటి త్యాగశీలత కనబరచలేకపోయాడు. అక్కడికీ" లెక్కగా రోజుకి ఏ మూడో నాలుగో కాల్చుకోండి. బొత్తిగా మానేయమని చెప్పడంలేదు. ఒక్కసారిగా అలవాటు మాన్పుకోవడమూ కష్టమే. క్రమేపీ తగ్గించుకుంటూ చివరికి పూర్తిగా మానేశారంటే ఒళ్ళు....ఇల్లు.. గుల్లయ్యే వ్యసన్నాని తప్పించుకోవచ్చు" అంటూ మెత్త మెత్తగా చెప్పేది మొదట్లో ఏళ్ళు గడచిపోతున్నా మార్పురాని తనని చూసి సహించనేరక.... అసహ్య పు చూపులతో, మాటలతో తనని చిత్రవధ చేస్తోందిప్పుడు. 'పొదుపు' అన్నమాట తన నోట్లోంచి రావడమనేది పెద్ద

అపరాధ విషయంలా ప్రవర్తిస్తోంది. తను 'మానేస్తున్నాను' అని తెలిస్తే చాలు. కొలీగ్స్ మరింత విజృంభించేస్తారు ముక్కూ మొహం తెలియనివాడు కూడ కల్పించుకు మాట్లాడి మరీ ఆఫర్ చేస్తున్నాడు వంకర నవ్వు లొలకబోస్తూ. అక్కడికి వాళ్ళకేమీ తెలీనట్లు వెధవ నాటకం. తనెక్కడ బాగుపడిపోతున్నానో. అని వెధవ కుళ్ళు. ఏడుపే 'మానేశాను' అని తెలిసిన మరుక్షణం తేనెటీగల్లా ముసురుకున్న జనం (ఆఫర్ చేయడానికై) తిరిగి ప్రారంభించాను అని తెలిసి ఒక్కడూ దరికి చేరడు. మానవుల్లో కోతి లక్షణం ఇంకా బలీయంగా వున్నదని చాటిచెప్పేందు కిదొక నిదర్శనం. ఈ విధంగా ఇంటా బయటా నరక యాతన ననుభవిస్తున్న తన గోడు ఎవ్వరికీ పట్టదు. తన బలహీనత తెలిసుండీ కసితో మొండిగా ఎడా పెడా ఖర్చుచేస్తూ, తనకి సహకరించకపోగా కవ్వించే ధోరణి నవలంబించి.... తను అప్పులపాలవుతూంటే విరసనగా నవ్వుతూ అందులోనే అలౌకికానందా న్ననుభవించే అరుణని చూస్తే ఒక ప్రక్క కోపం, మరో ప్రక్క జాలి ముంచుకొస్తాయి తనకి. ఇలా ఎక్కడికి సాగేను తన జీవితం? చివరికి అప్పుల పాలై సంసార చక్రాన్ని త్రిప్పే శక్తి లేక నడుం విరిగిననాడు అరుణ అదే విధంగా నవ్వగల్గుతుందా? దీనికంతటికీ సిగరెట్ కారణమనుకుంటే సిల్లీగా తోస్తుంది. కానీ ఇది నిజం. దీన్ని మానుకోవాలి. ఇన్ని అనర్థాలకు కారణమైన ఈ వ్యసనాన్ని తప్పించుకో లేడా? పనులు అవకతవకయి ఆఫీసర్ చేత చివాట్లు తినినా కాస్త ఇంట్లోనన్నా మనశ్శాంతి ఏర్పడుతుంది. క్రమేపీ అదే అలవాటయిపోతుంది. గట్టిగా పైకి అనకూడదుగానీ ఈ వెధవ సిగరెట్ల కోసం.... నెలకి ఎలా లేదన్నా అరవై రూపాయలయి కూర్చుంటోంది. అరుణ అన్నట్లు దాంతో చాలానే కొనవచ్చు. లేదూ అదంతా అదా చేస్తూంటే అంత గాకపోయినా కనీసం నెలకి అందులో సగం అదాచేసినా బాంక్‌లో కాస్త 'అంకెలు' కళ్ళబడి వుండేవి. ఈ అప్పు బాధ వుండకపోవును. నిట్టూర్చేడు ప్రకాశ్.

నెల తర్వాత. మళ్ళీ ఫస్ట్ తారీఖు సాయంత్రం. పనులన్నీ ముగించుకుని నీట్‌గా తయారయి ముందు గదిలో కూర్చుని పుస్తకం తిరగేస్తోంది అరుణ. పిల్లలిద్దరూ డ్రెస్ చేసుకుని ఆటలకి వెళ్ళిపోయారు. ఉన్నంతలో ఇల్లు పరిశుభ్రతతో కళకళ లాడుతోంది. సరిగ్గా ఆ సమయంలో సైకిల్ లోనికి తెస్తున్న ప్రకాశ్‌కి వాతావరణం ఆహ్లాదకరంగా తోచింది. భార్య చెంతనే కూర్చుంటూ "అరుణా! గుడ్ న్యూస్" అన్నాడు చిరునవ్వులు చిందిస్తూ. భర్త కళ్ళల్లోకి

ప్రశ్నార్థకంగా చూసింది అరుణ 'ఏమిట'న్నట్లు. "సీరియస్‌గా చెబుతున్నాను. ఇవాల్టినుండి సిగరెట్ జోలికిపోతే ఒట్టు. ఛస్తే మరి దాని ముఖం చూడను. మరి నీవేం తగ్గిస్తావో చూడు. అదిగో అలా ముఖం చిట్లించకు. నన్ను నమ్ము. మా అమ్మవి కదూ....! దుకాణంలో అప్పు పెరిగిపోతుంది. అప్పు తెస్తున్న వడ్డీ పెరిగిపోతోంది. వాడికేం? నిమ్మకు నీరెత్తినట్లు చల్లగా వినోదం చూస్తూ కూర్చుంటాడు అప్పు అడక్కుండ. వాడి వ్యాపారమే అదాయె. చెప్పు మరి. నీవేం తగ్గిస్తావు? అలా అనుమానంగా చూడకు ప్లీజ్.... బిలీవ్ మీ. నీ మీద ఒట్టు." దృఢంగా పలుకుతున్న భర్త మాటలకి ఫక్కుమంది అరుణ.

"చాల్లెస్తురూ....! ఎందుకొచ్చిన ఒట్లు. ఈ ఒట్టు అన్నపదం మీ నోట్లోంచి రావడం ఇవాళ క్రొత్త గనుకనా.... ఉబ్బి తబ్బిబ్బయిపోవడానికి. అది కూడ నామీద. అవును నేను ఛస్తే మీకేం? చక్కగా ఇంకొకర్తి వస్తుంది. నా పీడా పోతుంది. అంతేకదూ! ఎటొచ్చీ నష్టపోయేది. . అడుక్కు తినేది నా పిల్లలు" ముఖం కందగడ్డలా చేసుకుని విసురుగా అంది.

"ఛ....ఛ.... వెధవ కొంపాని.... వెధవ కొంప. నిజం చెబుతున్నా నిష్ఠూరాలు: పెడసరి సమాధానాలూను. మంచిగా అడుగుతుంటే చెప్పరాదూ!" ఆహ్లాదకరమైన వాతావరణం ఒక్కసారిగా స్థంభించిపోయింది.

"ఇంతకీ మీరనేదేమిటి?"

"ఏం తగ్గించగలవో చెప్పు."

"అది కూడ మీరే చెప్పండి. నేను దుబారా మనిషిని. నాకు తెలీదు" రోషంగా ముక్కుపుటా లెగరేసింది అరుణ.


ఎదురుగా రెపరెపలాడుతున్న లిస్ట్ కాగితం చేతిలోకి తీసుకున్నాడు ప్రకాశ్. వెంటనే "సబ్బులు తగ్గించేయ్. ఒక్కటి చాలు. సరిపెట్టు" అన్నాడు. "వీల్లేదు. ఈ వేసవికాలం రెండుపూటలా స్నానాలతో ఒక్క సబ్బుతో కుదరదు" నిక్కచ్చిగా తెగేసి చెప్పింది అరుణ. దాంతో ప్రకాశ్ కోపం తారాస్థాయినందుకుంది. అహం దెబ్బతింది.

"గౌరవం యిచ్చి అడుగుతున్నందుకు మహా పొగరుగావుంది. నే పట్రా నే సబ్బులు ఏంచేస్తావు?" గట్టిగా అరిచేడు.

"ఎందుకంతలా గొంతుచించుకుంటారు. మళ్ళా నన్నంటారు అరవొ ద్దని" ఆవేశంతో తనూ అరిచింది.

"నా ఇష్టం నేను అరుస్తాను. నువ్వెవరవు అడ్డుచెప్పడానికి? సబ్బులు తగ్గించమంటే పూనకం వచ్చినదానిలా వూగిపోతావు. ఏం సబ్బులతోటే పుట్టేవా...."

"అవునవును.... నేను సబ్బులతోటే పుట్టేను. మరి తమరు? సిగెరెట్ నోట ధరించి అవతరించేరా? సిగ్గులేకపోతేసరి. ఒకర్ని అనంగానే సరికాదు. ఏం?



అక్కడికి ఆ ఒట్టు నా మీదనే వేయక పోతే మీ అమ్మమీద వేయరాదూ! అహహ! అక్కడితో అమ్మ "హరీ" మంటుందని భయం. పెళ్ళాం చచ్చినా ఇబ్బందిలేదు. మరొకర్తి వేలడబ్బుతో మరీ వస్తుంది. మరో అమ్మ రాదుగా.... మరి" రోషంతో అక్కసుగా అంది.

"నోర్ముయ్. మా అమ్మ మా అత్తకు మధ్య. జరుగుతున్న సంభాషణ మన ఇద్దరికీ.... అయితే ఎక్కడోవున్న ఆవిడెందుకు లాక్కొస్తావు? ఛి....ఛి... సంసారం నడిబజారున పడిననాడు తెలిసొస్తుంది.... నీకు" విసురుగా సైకిల్ తీసుకుని సిగెరెట్ కోసం బయటి కెళ్ళి పోయాడు ప్రకాశ్.

ఉడుకుమోత్తనం, ఏం చేయలేని నిస్సహాయతతో వూగిపోయిన అరుణ అంతకుముందే ఆటల్నించొచ్చి తల్లీ దండ్రుల దెబ్బలాటకి భయపడి బిక్క చచ్చిపోయినట్లు బెదురుగా చూస్తున్న పిల్లల్ని చూస్తూనే శివమెత్తిపోయింది. ఈ పిల్లలు ఆయనద్వారా సంక్రమించిన వాళ్ళేగా! వీరివల్లే కదా... తనీ బంధంలో చిక్కుకుంది. లేకుంటే "ఫ్రీ"గా పోయి వుండేది ఈపాటికి. అంతే వెంటనే ఆ కారణంగా పిచ్చెత్తినట్లు చేతులు నొప్పెట్టేలా కొట్టి వాళ్ళనీ.... వాళ్ళని కన్నందుకు హేతువయిన వాళ్ళ నాన్నని వరుసగా తిట్ల వర్షం కురిపించి "చావండి వెధవల్లారా! చస్తే పీడా పోతుంది. వెధవ సంత.... వెధవ పెళ్ళి.... వెధవ మొగుడు.... వెధవ కొంప.... ఛి....ఛీ.... వెధవ పొగరు" ఆపై నోరు పెగలక వెక్కి వెక్కి ఏడుస్తూ మంచంమీద బోర్లాపడిపోయింది.

———